7

నైవేద్యం

అటు పిల్లనిచ్చిన మామగారూ, ఇటు కన్నతండ్రీ మరణించడంతో పరంధామయ్యగారు ప్రయోజకుడయాడు. అదివరకు అప్రయోజకుడని కాదు కాని ఆయనలో బీజమాత్రంగా వున్న ఆశయాలూ, ఆదర్శాలూ కార్యరూపం దాల్చే అవకాశం లభించిం దాయనకు. రెండు వైపులనుంచీ ఇరవై ఎకరాల మాగాణిభూమీ, నాలుగువేల రూపాయల రొఖ్ఖమూ ఆయన చేతిలోకి వచ్చినవి. ఇద్దరు తమ్ముళ్ళనూ, ఒక బావమరదినీ ఆయన పోషించవలసి వచ్చింది.

విద్యార్థిరోజులలో ఆయన సంపాదించిన పేరుప్రఖ్యాతుల కారణంగా స్వగ్రామంలోనే జిల్లాబోర్డు ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టరు ఉద్యోగం ఆయన సంపాదించాడు.

పరంధామయ్యగారంటే మామూలు పంతులు కాదని స్వగ్రామాని కేమిటి, అసలు ఆ తాలూకాకే తెలిసి రావడానికి ఒక సంవత్సరంకూడా పట్టలేదు.

ఆయన ఉద్యోగానికి వచ్చేటప్పటికి ఆ వూళ్లో స్కూలు నామమాత్రంగా వుండేది. పంతుళ్ళున్నారంటే ఉన్నారు, పాఠాలు చెపుతున్నారంటే చెపుతున్నారు. పిల్లలు బడికి వెళుతున్నారు; ఇంటికి తిరిగి వస్తున్నారు. ఇక స్కూలు భవనంకూడా అంతంతమాత్రంగానే వుండేది. పరంధామయ్యగారు స్కూలుకు హెడ్మాస్టరుగా రాగానే ఆ పరిస్థితి మారిపోయింది. స్కూలు అంటే యేమిటో పిల్లలకూ, గ్రామస్థులకూ, ఉపాధ్యాయులకూ కూడా తెలిసి వచ్చింది.

పరంధామయ్యగారు తెల్లవారుఝామున నాలుగు గంటలకే నిద్రలేస్తాడు. కాలవలో స్నానం చేసివచ్చి గంట సేపు జపం చేస్తాడు. సరిగ్గా ఆరున్నరకల్లా బడికి వెళతాడు. ఆ స్కూలుకు ఆ రోజులలో జవాను లేడు. కనుక ఆయనే తలుపులు తీసి గదులన్నీ వూడుస్తాడు. తానే మొదటి గంట కొడతాడు. మొదటి గంట కొట్టిన అయిదు నిమిషాలకల్లా పంతుళ్ళందరూ రావాలి. ఖర్మంకాలి ఏ యిబ్బంది కారణంగానైనా యే పంతులయినా ఒక రోజు ఆలస్యంగా వస్తే, పరంధామయ్యగారు వాళ్ళను ఏమీ అనక పోయినా వాళ్ళకే ఏదో బాధ కలిగేది. ఇక క్లాసులో పిల్లలకు చదువు చెప్పడం విషయంలో పరంధామయ్యగారికి ఒక ప్రత్యేకత ఉన్నది. పంతుళ్లను అగౌరవ పరచడం కాదు గాని, ఎలిమెంటరీ స్కూళ్ళల్లో చాలామంది పంతుళ్లు పిల్లలకు చెప్పవలసిన పాఠాలను ఇంటివద్ద చదవరు. పరంధా

మయ్యగారు అలా కాదు. ఆయన పిల్లలకు చెప్పవలసిన పాఠాలన్నీ శ్రద్ధగా చదువుతాడు. మనకు తెలిసిన విషయాలన్నీ పిల్లలకుకూడా తెలిసేటట్లు చెప్పడమే విద్యాబోధన. అందుకని ఆయన ఎప్పుడూ క్లాసులో పిల్లల ఎదుట పాఠం చదవడు. పాఠంలోని విషయాలపై పిల్లల దృష్టిని ఆకర్షించడానికిగాను తమాషా తమాషా ప్రశ్నలు వేస్తాడు. కొందరు పిల్లలు కొన్ని ప్రశ్నలకు సరయిన జవాబులు చెపుతారు. ఆ ప్రశ్నల సహాయంతో ఆయన పాఠంలోని విషయమంతా పిల్లలచేతనే చెప్పించి ఆతరువాత పిల్లలను ఆ పాఠం చదవమంటాడు. ఈవిధంగా పిల్లలకు పాఠం చెప్పే విషయంలో పరంధామయ్యగారు ఒక ప్రత్యేకతను సంపాదించాడు. ఆయనసంగతి తాలూకాలోని ఉపాధ్యాయులందరికీ తెలిసింది. మొదట్లో మొదట్లో ఆయనబళ్లో పనిచెయ్యడానికి కొంతమంది ఉపాధ్యాయులు జంకేవాళ్లు. కాని, తీరా ఆయనతో పరిచయం ఏర్పడ్డ తరువాత వాళ్ళకు కూడా ఆయనపద్ధతే నచ్చేది.

అంతేకాదు. పిల్లలందరిచేతా పంతులు పరంధామయ్యగారు పొద్దుటి పూటా, సాయంకాలంవేళా వ్యాయామం చేయించేవాడు. పొద్దుటిపూట ఏడుంబావుకల్లా ప్రార్థన చేయించేవాడు. పిల్ల లందరూ స్నానంచేసి బడికి శుభ్రంగా రావాలి. స్నానం చెయ్యని పిల్లలచేత బడిలోనే తోట బావివద్ద స్నానం చేయించేవాడు. వీటన్నింటికంటే విచిత్రమేమిటంటే, పలకలులేని పిల్లలకు పరంధామయ్యగారు పల

కలు కొని ఇస్తాడు. పుస్తకం లేనివాళ్ళకు పుస్తకాలు కొని ఇస్తాడు. హరిజనుల పిల్లలకు గుడ్డలు కొనిఇస్తాడు. ప్రతి శని వారం, సోమవారం పిల్లలకు తినుబండారాలు పంచిపెడతాడు.

వీటన్నింటివల్లా ఇటు గ్రామస్థులకూ, అటు పిల్లలకూ ఆయనంటే ఒక రకమైన భక్తీ, గౌరవం యేర్పడడంలో ఆశ్చర్యం యేమిటీ? పరంధామయ్యగారి కృషి రాణకు వచ్చింది. ఇన్‌స్పెక్టర్లు ఆయనను ప్రశంసించారు. జిల్లాబోర్డు ప్రెసిడెంటు ఆయనను మెచ్చుకున్నాడు. పిల్లల సంఖ్య పెరిగింది. ఆ పురాతనకాలపు నాటి కొంప బడికి చాలకపోయింది. పైగా అయిదేండ్లల్లో ఎలిమెంటరీ స్కూలల్లా హాయర్ ఎలిమెంటరీ స్కూలయింది.

ఎలాఅయినా స్కూలుకు సొంత భవనం ఏర్పాటు చెయ్యాలన్న పట్టుదల పరంధామయ్యగారికి ఎక్కువయింది. జిల్లాబోర్డు ప్రెసిడెంటును అడిగితే లాభంలేదన్నాడు. ఊళ్ళో పెద్దలందరినీ సమావేశపరిస్తే అయిదువందల రూపాయలకంటే ఎక్కువ చందాలు వసూలుకాలేదు. పరంధామయ్యగారు వెనుకముందులు చూడకుండా ఏడువేల రూపాయలు ఖర్చు పెట్టి స్కూలుకు సొంతభవనం కట్టించాడు. పెద్ద తోట వేశాడు. బళ్లో రాట్నాలూ, మగ్గాలూ పెట్టించాడు. నేత పరిశ్రమలో శిక్షణపొందిన ఒక స్నేహితుని సహాయంతో బళ్లోనే ఖద్దరు నేయించేవాడు. చిన్న పిల్లలచేత చాపలు అల్లించేవాడు.

ఈవిధంగా స్కూలు దినదినాభివృద్ధి చెందడంతో

పంతులు పరంధామయ్యగారి పేరు జిల్లా అంతటా మారు మ్రోగిపోయింది. పైగా తన స్కూలులో ఎనిమిదవ తరగతి పాసయినవాళ్ళల్లో అనేకమందిని ఆయన సొంత ఖర్చుతో ట్రెయినింగుకు పంపించాడు.

2

ఒకనాడు పరంధామయ్యగారితో కలిసి పనిచేస్తున్న రామమూర్తి బడికి ఆలస్యంగా వచ్చాడు. వస్తూనే, తన తరగతికి వెళ్ళకుండా పరంధామయ్యగారి గదికి వెళ్లాడు. రామమూర్తి వాలకం చూచి ఆయ నేదో ఇబ్బందిలో వున్నాడని పరంధామయ్య గ్రహించాడు.

"ఏం రామమూర్తిగారూ, ఏమిటి విశేషాలు?" అన్నాడు పరంధామయ్యగారు.

"అబ్బే, ఏం లేదండీ..."

"రోజూ ఇంటిదగ్గర ఆలస్యం అవుతున్నట్లున్నది!"

"అవునండీ ... కుర్రవాడికి నాలుగు రోజులనుంచీ జ్వరం. ఇవాళ ఆవిడకూడా లేవలేదు."

"డాక్టరు కెవరికైనా చూపించక పోయారా?"

"ఆఁ...శర్మగారు మందు ఇస్తున్నారు. టైఫాయిడ్ అన్నారు. బస్తీకి తీసుకువెళ్ళాలి సొస్తుందేమో నన్నారు."

"మరి సెలవు పెట్టి వెళ్లకపోయారా? మన పాట్లన్నీ వాళ్లకోసమేగా!"

''అవు ననుకోండి. సెలవు పెట్టి ఏంచేసేదీ? చేతిలో దమ్మిడీ లేదు.''

''అట్లాగా? ఆ మాట నాకు ఎందుకు చెప్పలేదూ?''

''ఏం చెప్పమంటారూ? ఇప్పటికే మీకు చాలా బాకీ వున్నాను.''

''బాకీ మాట తరువాత చూచుకొందాం. మధ్యాహ్నం ఇంటికి రండి. చేతనయింది చేస్తాను. ఆ తరువాతి సంగతి తరువాతనే. ఇక పదండి. అవతల పిల్లలు గోల చేస్తూంటారు.''

ఈ విధంగా పరంధామయ్యగారు చాలామంది పంతుళ్ళకు సహాయం చేశాడు. పంతుళ్లకు అనే మేమిటి? ఇన్‌స్పెక్టర్లుకూడా ఆయనసహాయం పొందారు. ఆయన ఆశయాలూ, ఆదర్శాలూ అంతటితో ఆగలేదు. ఆయన వేద పండితులను పిలిపించి, సభలు జరిపించి, దుశ్శాలువలూ, నూటపదహార్లూ ఇచ్చి సత్కరించేవాడు. ఏడాదికి కనీసం మూడుసార్లయినా సమారాధనలు చేసేవాడు. కనీసం పదిహేనేండ్లపాటు ఆయింట్లో యేనాడూ ఇరవై విస్తళ్లకు తక్కువ లేచేవికావు.

ఈ విధంగా గంటకు అరవైమైళ్ల వేగంతో వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ప్రయాణంగా పరంధామయ్యగారి నలభైఅయిదేండ్ల జీవితం పరుగెత్తింది.

అప్పటికి ఆయన బావమరది-మూర్తి స్కూల్‌ఫైనల్ పాసయినాడు. ఏదో గుమాస్తాగిరిలో చేరాడు. పరంధా

మయ్యగారు బావమరదికీ, పెద్దతమ్ముడికీ పెళ్లిళ్లుచేశారు. పెద్దతమ్ముడు అన్నగారినుంచి విడిపోయి వేరేకాపరం పెట్టాడు. అదిచూచి బావమరదికూడా విడిపోయినాడు.

వెళ్లేవాళ్లు ఊరికే వెళ్లలేదు. పరంధామయ్యగారి ప్రశాంతజీవితాన్ని కల్లోలపరిచి మరీ వెళ్ళారు. గుడ్డిలో మెల్ల! పరంధామయ్యగారికి ఇద్దరే పిల్లలు. పెద్దవాడు సుబ్బారావ్ స్కూల్ఫైనల్ చదువుతున్నాడు. రెండో వాడు చిన్నపిల్లవాడు.

బావమరదికి పరంధామయ్యగారంటే గౌరవభక్తులు లేవు గాని విద్వేషం కూడా లేదు. కనుక తన పదెకరాలలో మిగిలిన ఆరు ఎకరాల భూమినీ, తన వంతు అప్పు నాలుగు వేల రూపాయలనూ తీసుకొని వేరే వెళ్లాడు. ఇక పరంధామయ్యగారి జీవితాన్ని కల్లోలపరచింది ఆయన పెద్దతమ్ముడు శర్మ. శర్మకు పరంధామయ్య గారు బియ్యేదాకా చెప్పించాడు. భాగ్యవంతుల పిల్లను తెచ్చి పెద్దకట్నం ఇప్పించి పెళ్ళిచేశాడు. పెళ్ళయినప్పటినుంచీ శర్మమామగారు ఆస్తి పంపిణీ చేసుకోమని శర్మను రాపాడాడు. పైగా శర్మ ఇల్లరికం వెళ్లాడు. భార్యపోరు పడలేక నైతేనేం, మామ గారి మాట కాదనలేకనైతేనేం శర్మ ఆస్తి పంపిణీకోసం పరంధామయ్యగారిమీద దావావేశాడు. శర్మ వచ్చి పరంధామయ్యగారిని ఆస్తికావాలని అడిగితే ఆయన ఏ క్షణాన్న యినా ఇచ్చేవాడు. ఆ సంగతి పరంధామయ్యగారిని ఎరిగున్న వాళ్లందరికీ తెలుసు. కాని, దావా వేశాడు. ఎందుకు వేశా

డంటే ఒక చిదంబరరహస్యం ఉన్నది. పరంధామయ్యగారి మేనల్లుడు కృష్ణమూర్తి మద్రాసు క్రిస్టియన్ కాలేజిలో ఎమ్. ఏ. పాసయి ఎవరికీ చెప్పకుండా లండన్ వెళ్ళాడు. వెళ్ళి ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్నాను, పది వేల రూపాయలు అప్పుగా పంపించమని పరంధామయ్య గారికి వ్రాశాడు.

పరంధామయ్యగారు ముందు వెనుకలు చూడకుండా, పదిఎకరాలు తాకట్టు పెట్టి పదివేల రూపాయిలు మారు వాడీదగ్గర అప్పు తీసుకొచ్చి కృష్ణమూర్తికి పంపించాడు. కృష్ణమూర్తి చదువు పూర్తయి బొంబాయిలో ఉద్యోగం చేస్తూ చచ్చిపోయాడు. ఆ అప్పు పరంధామయ్యగారే తీర్చ వలసివచ్చింది. అందుకు అయిదెకరాల పొలం అమ్మాడు. ఆ అప్పుతో తనకు సంబంధం లేదని శర్మ అంటాడు. ఆ మాట పరంధామయ్యగారి ఎదుట అనలేడు. కోర్టులో అయితే అది వేరేసంగతి. కనుకనే దావా వేశాడు. ఇందులో విచారణ జరపవలసినంత పెద్ద విషయం ఏమిఉన్నది కనుక?

మారువాడీలకు పోయినంత ఆస్తి పోగా మిగిలిన ఆస్తిలో రెండువంతులు శర్మకూ, ఒకవంతు రెండో తమ్ముడు రంగారావుకూ నని కోర్టు తీర్పు చెప్పింది. రెండవ తమ్ముడి వాటాకింద పరంధామయ్యగా రుంటున్న ఇల్లు వచ్చింది. ఎందుకూపనికిరాని మెట్ట ఒక ఎకరంకూడా వచ్చింది.

ఇటువంటి కష్టకాలంలో రెండవతమ్ముడు రంగారావ్ ఇంట్లో చెప్పా పెట్టకుండా లేచిపోయినాడు. ఈ ఆఖరు

రోజులలో చేతికి వస్తాడని అతనిమీద పరంధామయ్య పెట్టు కొన్న ఆశలు నిరాశలే అయాయి.

3

కొండలలో పుట్టిన నది కొండలవాలులో విపరీతమైన వేగంతో ప్రవహించి మైదానంలో మందగమనం సాగించి తుదకు నిలవదొక్కుకొన్నట్లు పరంధామయ్యగారు తన జీవిత పుటలను సింహావలోకనం చేస్తున్నాడు. సింహావ లోకనం చేస్తూ వరండాలో అటూ యిటూ పచారుచేస్తు న్నాడు......

తన జీవితం ఎంత వేగంగా తెలియకుండా గడిచి పోయిందీ? ఇదంతా తాను ఎందుకు చేసినట్లూ? ఏమి ఆశించి ఇంతగా తాను ప్రయాసపడ్డట్లూ? ఎవరిని సంతోష పెట్టగలిగాడూ? రెండుచేతులతోనూ డబ్బు సంపాదించి ఇల్లాలినీ, కుటుంబాన్నీ సంతోషపెట్టగలిగాడా? తమ్ము ళ్లకు తను చేయగలిగిందంతా చేశాడా? పెద్దతమ్ముడికి బియ్యేదాకా చదువు చెప్పించి ఉద్యోగం చూపించి పెళ్ళి చేశాడు. పెళ్ళిచేసిన తరువాత......

ఆ శివరాత్రి నాటి సాయంకాలం ఆవిధంగా ఆ వరం డాలో అటూ ఇటూ పచారు చేస్తూ ఆలోచిస్తున్న పరంధా మయ్యగారికి జీవితంలో మొట్టమొదటిసారి కళ్ళు చెమ్మగిలి నవి...ఆయనభార్య పార్వతమ్మగారు వరండాలో పచారు చేస్తున్న భర్తను చూచింది. ఇన్నేండ్లుగా చూస్తున్న

పరంధామయ్య కాదనిపించిం దామెకు. ఆక్షణంలో అంతగా ఆయనకళ్ళు ఎందుకు ఎర్రపడ్డయ్ ? ఎప్పుడూ గంభీరంగా వుండే ఆ ముఖం ఎందు కంత కందగడ్డ అయిందీ?

"ఏమండీ...సాయంకాలమయింది. స్నానం చేస్తారా? గుడికి వెళతారా ?" అన్నది, భర్తను చూచి. భర్తను చూస్తే ఆమెకు మామూలుగానే భయం. భయమంటే ఆయన కొడతాడనీ, తిడతాడనీ కాదు. ఆయనస్వభావమే అంత. నిత్యాగ్నిహోత్రుడు. కర్మిష్ఠి. ఎప్పుడూ యేదో పని చేస్తూంటే తప్ప తోచని పరంధామయ్యగారిని చూస్తే పార్వతమ్మగారికే కాదు, ఇరుగుపొరుగువాళ్లకు కూడా కొంచెం భయమే.

"స్నానమా! ఎందుకూ!... సరేకాని, పిల్లలేరీ?" అన్నాడు పరంధామయ్య. ఆ అనటం మామూలుగా లేదు. దేశాంతరం పోయి ఇంటికి తిరిగివచ్చిన భర్త మొట్ట మొదటి సారి భార్యతో మాట్లాడేటప్పుడు కనిపించే ఆప్యాయత, అనురాగం ఆయనమాటలలో తొణికిసలాడినయ్.

'పిల్లలేరీ' అని ఆయన అడిగాడు. ఆ అడగడం పార్వతమ్మకు ఆశ్చర్యం కలిగించింది. ఆ పిల్లలు అనేవాళ్ళు ఇంట్లో ఉన్నారనీ, వాళ్ళ మంచి చెడ్డల బాధ్యత తనపై ఉన్నదనీ భర్తకు ఈనాడు తెలిసిందా అనిపించింది పార్వతమ్మకు. అట్లా అని పరంధామయ్యగారు పిల్లల చదువు సంగతి కాని, మంచిచెడుల సంగతిగాని ఏమీ పట్టించుకోనే పట్టించుకోలేదని చెప్పడానికి వీలు లేదు. సొంత కొడుకులను

కూడా ఆయన బడిపిల్లలలాగానే చూశాడు. బళ్ళోపిల్లల చదువుసంధ్యల విషయంలో ఎంత శ్రద్ధ చూపించాడో ఇంట్లో తన పిల్లల చదువు సంధ్యల విషయంలోకూడా అంతే శ్రద్ధ చూపించాడు. వాళ్లకు ఏంకావాలన్నా రెండో తమ్ముడు రంగారావుద్వారా ఆ పార్వతమ్మ పరంధామయ్యగారిని అడిగించేది. పరంధామయ్యగారికి రెండో తమ్ముడంటే వాత్సల్యం కనుక రంగారావు చెప్పగానే పిల్లలకు కావలసిన వన్నీ తెచ్చేవాడు. ఇట్లాంటి పరంధామయ్య ఈవేళ—ఈ శివరాత్రినాటి సాయంసమయాన 'పిల్లలేరీ' అని ఎందుకు అడిగాడని పార్వతమ్మగారు ఆలోచిస్తూండగా రెండో కొడుకు వచ్చి 'అమ్మా, అన్నం పెట్టవే' అన్నాడు.

పరంధామయ్యగారు వాడిదగ్గరికి వెళ్ళి ఎత్తుకున్నాడు. నెలలపిల్లవాడినే ముద్దుగా ఎత్తుకొనడానికే తీరికలేని పరంధామయ్యగారు పన్నెండేండ్ల రెండోకొడుకును ఎత్తుకొనడం పార్వతమ్మకు ఆశ్చర్యం కలిగించదా మరి! వాడు బిత్తర పోయినాడు.

"చూడూ, బాబూ, అన్నయ్య యేడీ?" అన్నాడు పరంధామయ్య.

"కోమటి కోటయ్య కొట్టుకు వెళ్ళాడు" అన్నాడు వాడు భయపడుతూ.

"ఎందుకు?" అన్నాడు పరంధామయ్య.

"అమ్మ పంపించింది."

"అట్లాగా...నువ్వు వెళ్ళి పిలుచుకురా" అన్నాడు

పరంధామయ్య వాణ్ణి దింపుతూ. పెద్దపులి పంజాలోనుంచి ఎట్లాగో తప్పించుకోగలిగిన మేకపిల్లలాగా వాడు పరుగు తీశాడు. మళ్ళీ పరంధామయ్యగారు అటూ యిటూ పచారు ప్రారంభించాడు. పార్వతమ్మ వంటింట్లోకి వెళ్ళింది. తెగిపోయిన ఆలోచనలకు అతుకు దొరికింది.

"అవును మరి. పెద్దతమ్ముడు మాత్రం ఏం చేస్తాడు? ఆస్తి అంతా అయిపోతున్నదని కనిపెట్టి వాటా పంచ మన్నాడు. వాడికీ పిల్లలున్నారాయె. ఆస్తి అంతా తన దర్జాకిందా, తన ఆదర్శాలనేవాటిని అమలు జరపడంకిందా, వంశగౌరవం అనేదానికిందా బలి అయిపోతే వాడూ, వాడి పిల్లలూ ఏం కావాలి? అదీకాక, తన తండ్రికి తానొక్కడే కొడుకు కాదుగదా? తను నిలిపినట్లు వాడు మాత్రం వంశ గౌరవం నిలపవద్దా? నిలపాలి. నిలపాలంటే, వాళ్ళ ఆదర్శా లనూ, ఆశయాలనూ వాళ్లు అమలుజరపాలంటే కొంత ఆస్తి కావాలి. కేవలం ఉద్యోగంచేసి సంపాదించే డబ్బు చాలక పోవచ్చు. కనుక వాడికి ఆస్తికావాలి. కావాలికనుక నే దావా వేశాడు. మిగిలిన ఆస్తి అంతా వాడికే సంక్రమించింది. ఇందులో వాడి తప్పేమిటి? వాడి తప్పు కాకపోతే తనదా తప్పు? తనేంచేశాడూ? తను కాఫీ తాగడు. వక్కపలుకు వేసుకోడు. సిగరెట్ తాగడు. ఆస్తి అయిపోయింది! ఎట్లా అయిపోయింది?..."

అంతలో 'అమ్మా' అంటూ పెద్దకొడుకు వచ్చాడు.

వంటఇంట్లో వత్తులు చేసుకొంటున్న పార్వతమ్మ

వచ్చేలోగా పరంధామయ్యగారు కలిపించుకొని "ఏం బాబూ, ఎక్కడికి వెళ్ళావ్" అన్నాడు.

పరంధామయ్యగారు కొడుకును ఈ ప్రశ్న ఎన్నడూ అడగనే లేదనిపించింది. కొడుకు ఎక్కడికి వెళుతున్నాడో తెలుసుకోవలసిన పరిస్థితి పరంధామయ్యగారికి ఇంతవరకూ కలుగలేదు. అంతేకాదు. తెలుసుకొనే తీరికకూడా ఆయనకు లేకపోయింది. అందుచేత పెద్దకొడుకు తండ్రివంక కాకుండా ఇంటి కప్పుకిందగా గోడకు ఐమూలగా చూస్తూ "రామమూర్తి గారింటికి వెళ్ళాను" అన్నాడు.

"కోమటి కోటయ్యదగ్గరికి వెళ్లావని తమ్ముడు చెప్పాడే" అన్నాడు పరంధామయ్య.

తండ్రికి నిజం తెలిసిందనే కారణంగా కొడుక్కి కలగవలసిన భయంకంటే ఆ క్షణంలో వాడికి అవమానమే కలిగింది. ఎందుచేతనంటే వాడంతట వాడు ఈ అబద్ధం చెప్పలేదు. కోమటి కోటయ్యను బతిమాలుకొని వస్తువులు అప్పుగా తీసుకురమ్మని తల్లి చెప్పింది. నాన్న అడిగితే నిజం చెప్పవద్దన్నది. చెపితే అప్పుచేసేకంటే పస్తులుండటం మంచిదని పరంధామయ్యగారు ఆగ్రహిస్తాడు. ఏమి చెప్పడమా అని వాడు ఆలోచిస్తూండగా పార్వతమ్మగారు వచ్చి వాడికి ఆబాధ తొలిగించింది.

"ఏమిటి అడుగుతున్నారు? నేనే పంపించా కోమటింటికి. తెల్లవారితే పొయిలో పిల్లిలేచే వీలు కనిపించడం లేదు. అందులోనూ ఇవాళ శివరాత్రి. ఇవాళల్లా

మంచినీళ్లుకూడా తాగకుండా ఉపవాసం వున్నారు. రెండు మానికల బియ్యం, సవాశేరు నెయ్యి అప్పుగా తెమ్మన్నాను'' అన్నది.

''అట్లాగా? ఇంట్లో ఏమీ లేవని నాకు చెప్పకపోయావ్'' అన్నాడు పరంధామయ్య. కాని, ఆ అనడంలో కోపం లేదు. అభిమానం లేదు. అభిమానంవల్ల కలిగే బాధ లేదు.

పరంధామయ్యగారు స్వయంగా కోమటింటికి వెళ్లి ఇంట్లోకి కావలసినవి తెచ్చి ఇరవైయేండ్లు అవుతుంది. ఇంట్లో ఎప్పుడూ ప్రైవేటు చదువుకునే పిల్లలో, ఉద్యోగాలు దొరకని పంతుళ్లో, ఉద్యోగా లూడిన పంతుళ్లో హాజరులో వుండేవాళ్లు. వాళ్లే ఇంట్లోకి కావలసిన వన్నీ తెచ్చేవాళ్ళు. కోమటి కోటయ్య ఎప్పుడు ఖబురుచేస్తే అప్పుడు పరంధామయ్యగారు డబ్బు పంపించేవాడు.

ఆ నిశీథవేళ పరంధామయ్యగారు కోటయ్యకొట్టుకు నడుస్తున్నాడు. ఆశ్చర్యం! కొట్టుకు వెళుతూండగా ఆయనకు ఈనాడు కోటయ్యపూర్వజీవితం లీలగా కనిపించింది. ఈ కోటయ్య పళ్లెంతో పకోడీలు అమ్ముకొంటూ ఇరవయ్యేండ్ల కిందట ఈ ఊరు వచ్చాడు. రోజంతా కష్టపడినా రూపాయ దొరకడం దుర్లభమయిన ఆ రోజులలో కోటయ్యంటే తనకు చాలా గౌరవ మేర్పడింది. ఆ గౌరవాన్ని పురస్కరించుకునే తను కోటయ్యకు పెట్టుబడి పెట్టాడు. ఆ పెట్టుబడి ఎంతో, అందులో కోటయ్య తనకు ఎంత తిరిగి

ఇచ్చాడో ఈనాడు పరంధామయ్యకు గుర్తులేదు. వీటన్నింటికీ యేమి వచ్చెగాని కోమటి కోటయ్య ఎంత మంచివాడు? ఎంత కష్టపడి పనిచేసి ఈనాడు ఇంత వ్యాపారం చెయ్యగలుగుతున్నాడు! కాకిచేత తను కబురుచేస్తే ఇంట్లోకి కావలసినవన్నీ పంపించేవాడు. కోటయ్యకొట్లో ధరలు ఎక్కువని పార్వతమ్మ గొడవ పెడుతుంది. ఏం ఎక్కువ ధరలు తీసుకోంటే? తీసుకోకపోతే కోటయ్య ఇంత వ్యాపారం ఎలా చెయ్యగలుగుతాడు? అనుకొంటూ పరంధామయ్యగారు కోటయ్యకొట్టుదగ్గరికి వెళ్ళాడు. కొంచెం దూరాన పంతులు పరంధామయ్యగారిని చూడగానే కొట్టు మీదనున్న కోటయ్య గబగబా బయటికి వచ్చి, "పంతులుగారా, రండి, రండి. దండాలు" అన్నాడు.

"కోటయ్యా, కులాసాగా వున్నావా?"

"ఏదో బాబూ, మీ దయవల్ల అట్లాట్లా వున్నాను."

"ఇంకా నా దయేమిటంటావా?" అన్నాడు పరంధామయ్యగారు కోటయ్యను పరకాయించి చూస్తూ.

"అవును. బాబూ. మీ దయే. ఆనాడు మీరు రెండు వేల రూపాయిలు ఇచ్చి దీపారాధన చెయ్యమన్నారు. మీ చేతి చలవవల్ల నిలబడ్డాను. ఇప్పుడు మళ్ళీ మీరే నన్ను నిలబెట్టాలి."

"అదేమిటి కోటయ్యా, అట్లా అంటున్నావ్? ఇప్పుడు నీకు నేనేం చేసిపెట్టాలీ?"

"వేరే యేమీ చెయ్యనక్కరలేదు బాబూ... పాత

ఖాతాన మొత్తం పదిహేను వందలదాకా నిలబడిఉన్నది. దయయుంచి రెండుమూడు రోజులలో సర్దుబాటుచేస్తే..."

పరంధామయ్య కాళ్ళు వణికినయ్. కోటయ్యకు తాను పదిహేను వందల రూపాయలు బాకీ వున్నాడా? ఇంత బాకీ వుంటే యిన్నిరోజులూ ఎందుకు ఊరుకున్నాడు? మంచితనం వల్లనా? అయితే మాత్రం? తమ్ముడు దావావేసి ఆస్తిఅంతా తీసుకుంటున్నాడన్న సంగతి కోటయ్యకు తెలియదా? తెలిస్తే ఎందుకు వూరుకున్నాడూ? ఏమో ఆ దావా తరువాతనే తాను ఇంత బాకీ తేలాడేమో?

"అట్లాగే కోటయ్యా, నాలుగైదు రోజులలో సర్దుబాటు చేస్తాను." అని ఎట్లాగో అనగలిగాడు పరంధామయ్య.

4

పంతులు పరంధామయ్యగారు తాతలనాటి ఇల్లు కూడా అమ్మివేశారన్న సంగతి తెలిసినప్పుడు వూరువూరంతా అనేక రకాలుగా వ్యాఖ్యానించింది.

'అవును మరి, ఎంత పెద్ద ఆస్తి అయితే మాత్రం అంత జమీందారీ ఫాయిదాపోతే యేమవుతుం'దని కొందరన్నారు. 'ఎంత మంచివాడయితే మాత్రం అప్పు ఇచ్చినవారిని తిరిగి అడక్కపోతే యేమవుతుం'దని కొందరు పెద్దలు తీర్పు చెప్పారు.

అవధానులుగారి—అంటే పరంధామయ్యగారి తండ్రి పేరు నిలపెట్టాడన్న కొందరు ముసలివాళ్లు కూడా ఆ

గ్రామంలో లేకపోలేదు. లోకమంతా యేవిధంగా అనుకొంటున్నా, తన కనుసైగలలో మెలిగిన పంతుళ్లే యీనాడు తన తప్పులు పట్టడానికి సాహసిస్తున్నా పరంధామయ్యగారు ఉద్యోగం మానలేదు. అయితే ఆయనజీవితంలో వచ్చిన పెద్దమార్పేమిటంటే ఇదివరకు వూళ్ళో పనులన్నీ ఎంతగా నెత్తిమీద వేసుకునేవాడో అంతగా యీనాడు ప్రపంచవ్యవహారాలను నిర్లిప్తంగా చూస్తున్నాడు. ఒకనాడు ఎంత నిష్ఠగా దేవతార్చన చేసేవాడో, అంత నిష్ఠగా సొంత పిల్లల చదువూ, మంచిచెడుల విషయాలలో కృషిచేస్తున్నాడు.

ఇల్లు అమ్మగా ఆరోజులలో నాలుగువేల రూపాయలు వచ్చినయ్. కోటయ్య బాకీ పదిహేను వందలూ పోను మిగతా డబ్బులో వెయ్యి రూపాయలు పెట్టి రెండువందల గజాల స్థలంలో పూరిల్లొకటి వేసుకున్నాడు. ఇంటిచుట్టూ సమంగా తోటపెంచుతున్నాడు. ఒకప్పుడు పరంధామయ్యగారిని చూచినవాళ్ళు ఆయనను ఇప్పుడు గుర్తుపట్టలేరు. పెద్దపిల్లవాడికి లైఫ్‌రైటింగూ, పార్టుహాండూ చెప్పిస్తున్నాడు. రెండో పిల్లవాడి చదువు విషయంలో ఆయన చేసిన కృషి రాణించలేదు.

విచిత్ర మేమిటంటే ఆయనజీవితంలో యిన్ని మార్పులు వచ్చినా, పెద్దతమ్ముడు ఒక్కనాడుకూడా ఆయనను చూడడానికి రాలేదు. తండ్రి పసితనంలోనే పోగా మంచిచెడులన్నీ నెత్తిమీద వేసుకొని చదువుసంధ్యలు చెప్పించి పెద్దవాణ్ణిచేసిన బావమరది అయినా ఆయనను

పరామర్శించలేదు. అవును మరి? ఎందుకు ఓదార్చాలి! వాళ్ళ ఆస్తిని మంచినీళ్ల ప్రాయంగా పరంధామయ్యగారు తన కీర్తిప్రతిష్ఠలకోసం వాడుకొన్నాడామె.

వాళ్లందరి సంగతీ అటుంచండి. పూర్వం ఆయనవల్ల సహాయంపొందిన పంతుళ్ళుగాని, మాస్టరంటే మాస్టరు పరంధామయ్య గారేనని ఇన్‌స్పెక్షనుకు వచ్చినప్పుడల్లా భజనచేసిన అధికారులు కాని ఆయనమీాద సానుభూతి చూపించలేదు. 'నువ్వు ముసలివాడివయావ్. నీ వొంట్లో శక్తిలేదు. ఇక ఉద్యోగం నుంచి తప్పుకో'మని జిల్లాబోర్డు శాసించింది.

అయినా పరంధామయ్యగారు బాధపడలేదు. బాధ పడ్డట్లు కనిపించనూలేదు. ఇదంతా యిలా జరుగుతుందని ఇదివరకే తనకు తెలుసునన్నట్లుగా ఆయన నిర్విచారంగానే రోజులు నెట్టుకొస్తున్నాడు.

అటువంటి రోజులలో పరంధామయ్యగారి భార్య పార్వతమ్మ కలరావల్ల మరణించింది. ఊళ్ళో కలరా వ్యాపిస్తున్నదని తెలిసి పరంధామయ్యగారు పేటపేటకూ, ఇంటింటికీ వెళ్ళి హోమియో మందులు పంచిపెట్టాడు. కలరా రాకుండా పడవలసిన జాగ్రతలను పిన్న పెద్ద లందరికీ వివరించాడు. కాని, సొంత భార్యను కాపాడుకోలేకపోయాడు.

కలరావల్ల ఇంట్లో మనిషి మరణించడంవల్ల పరంధామయ్యగారిని పరామర్శించడానికిగాని, ఆఖరికి పార్వతమ్మగారి శవాన్ని స్మశానానికి తీసుకువెళ్లే విషయంలో

సహాయపడటానికిగాని వూళ్ళోవాళ్ళు ఎవరూ రాలేదు.

చుట్టాలు అంతకన్నా రాలేదు. తండ్రి కొడుకులు ముగ్గురూ ఎట్లాగో తంటాలుపడి ఆ శవాన్ని స్మశానానికి చేరవేసి దహనసంస్కారాలు అయినవంటే అయినవని పించారు. ఆ పదిపదిహేను రోజులూ గడిచినయ్. పరంధామయ్యగారే పిల్లలకు స్వయంగా అన్నం వండి పెడుతున్నాడు. పార్వతమ్మగారి మరణం పరంధామయ్యగారి దినచర్యలలోగాని, బాహ్యప్రవర్తనలోగాని మార్పు తీసుకురాలేదు.

ఆయనకు ఒకటే ఒక దిగులు! రంగారావ్ ఏనాటి కయినా తిరిగి రాకతప్పదు. వచ్చి 'నా ఆస్తి ఏంచేశా'వని అడిగితే యేంచెప్పాలి? తనకేం? ఊరు పొమ్మంటున్నది, కాడు రమ్మంటూన్నది. తన ఇద్దరు పిల్లలుకూడా యేదో ఒకవిధంగా బతకక్కపోరు. కాని, రంగారావ్ దే తనకు పెద్ద దిగులు. వాడు నెలల పిల్లవాడుగా వుండగానే తల్లి చనిపోగా తానే తల్లిగా వాణ్ణి పోషించాడు. చదువు చెప్పించాడు. పెద్ద పెద్ద కట్నాలతో పిల్లను ఇస్తామని ఎందరువచ్చినా 'నాకు పెళ్ళివద్దంటే వ'ద్దని రంగారావ్ ఎదురుతిరిగాడు. తన మాటకు ఎన్నడూ ఎదురుచెప్పని రంగారావ్ పెళ్ళివిషయంలో ఎదురుతిరిగాడు. పాపం, వాడికి తనంటే ఎంత ఇష్టం? ఎంత గౌరవం? వాడికి కూడా పెళ్ళిచేస్తే ఒక ఇంటివాడయివుండేవాడు. వాడికి రావలసింది వాడుకూడా తీసుకొనివుంటే తన బరువు తగ్గివుండేది. ఇదే

విషయం రంగారావ్‌కు తాను ఎన్నోసార్లు చెప్పాడు. కాని తనమాట వాడు పెడచెవిని పెట్టాడు. పైగా "నాయిష్టం, నాకు ఈ ఆస్తిలో దమ్మిడీవద్దు. అమ్మను నేను ఎరగను. అమ్మవయినా, అన్నవయినా నువ్వే. నువ్వుమాత్రం ఆస్తి అనవసరంగా తగలపెట్టావ్ కనుకనా? కానిరోజులు వచ్చినయ్. అంతా కొట్టుకుపోయింది. మిగిలిందేమో మిగిలింది. అదంతా నీదే. నీ ఇష్టం. నువ్వు ఏంచేసుకొన్నాసరే"నని వాదించాడు. అంత ప్రేమగల తమ్ముడి వాటాలోని ఇల్లు తాను అమ్మాడు. ఎందుకు అమ్మాడూ? పిల్లలకు చదువు చెప్పించడానికా? ఆడపిల్లలకు పెళ్లిళ్లు చెయ్యడానికా? వీటిలో వేటికయినా తాను ఈ అన్యాయం చేసివుంటే పరంధామయ్యగారి ఆత్మ ఇంతగా బాధపడి వుండేది కాదు.

వంశగౌరవంకోసం - అంటే తాను ఫలానివారి కొడుకునన్న కీర్తి నిలబెట్టుకొనడానికి తాతలనాటి ఇల్లు అమ్మాడు. నిజంగా దేవుడనేవాడు ఉంటే తానుచేసిన ఈపనిని క్షమిస్తాడా? ఈ దిగులుతోనే పరంధామయ్యగారు కూడా మంచమెక్కాడు. ఇప్పుడు ఆ యింట్లో అన్నీ ఆయన పెద్దకొడుకే చూడవలసి వచ్చింది.

ఆచార్యులుగారు వచ్చి చెయ్యిచూసి "అబ్బే! యేమీలేదు. రెండురోజులు లంఖణంచేస్తే అదే తగ్గిపోతుం"దని యేవో నాలుగుమాత్రలు ఇచ్చాడు. రెండు రోజులు కాదుగదా రెండు పదులు ఇరవైరోజులయినా జ్వరం తగ్గక పోగా సంధి పుట్టుకొచ్చింది. ఆయనతో కలిసి పనిచేసిన

పంతుళ్ళూ, ఆయన సహాయం పొందిన పంతుళ్ళూ వచ్చి చూచిపోతున్నారు. పిల్లలను ఓదారుస్తున్నారు. అంతేగాని, ఒక్కళ్ళుకూడా వాళ్ళను ఆదుకోలేదు. అటువంటి రోజులలో రంగారావ్ తిరిగి వచ్చాడు. వస్తూనే పరంధామయ్యగారి మంచంమీదపడి పసిపిల్లవాడిలాగా యేడ్చాడు. కాని, వాడి యేడుపు పరంధామయ్యగారికి వినిపించనిదే! ఆయన కలవరిస్తున్నాడు.

"రంగా...రంగా...పాపాత్ముణ్ణి... మోసగాణ్ణి... క్షమించవూ..." అన్నా డొకసారి.

"అవున్లే. నేను చేసిందంతా తప్పే. కాని, ఆ మాట నువ్వు ఇప్పుడు చెప్తే యేం లాభం? నాన్న అంటే ఈ వూళ్ళో ఎంత గౌరవం వుండేది? ఆ గౌరవం నిలబెట్టడానికే నేను ఇదంతా చేశాను..." అన్నాడు మరోసారి. మరోసారి బిగ్గరగా నవ్వి..."దేవుడు. దేవుడికి నైవేద్యం. శివుడికి హారతిచ్చి, నైవేద్యం పెట్టాను. నా ఆస్తి, తమ్ముళ్ళ ఆస్తి, బావమరిది ఆస్తిలో కొంత అందుకే అయిపోయింది... ఓహో...స్వర్గం...మీ అందరికీ స్వర్గం సిద్ధం..."

రంగారావ్ అన్నగారి జబ్బు చూచి ఆందోళన పడ్డాడు. బస్తీకి వెళ్ళి పెద్ద డాక్టరును తీసుకువచ్చాడు. ఎప్పటికప్పుడు డాక్టరుదగ్గరికి వెళ్ళి మందు తీసుకురావడానికి ఒక మనిషిని పెట్టాడు.

పిల్లలను చూచి ఏడ్చాడు. పార్వతమ్మ పోయిందన్న సంగతి తెలుసుకొని పెద్ద పిల్లవాణ్ణి చూచి రంగారావ్ ఒక రోజు ఇలా అన్నాడు:

"బాబూ ... అమ్మవంటి మనిషిని ప్రపంచంలో ఎక్కడా చూడం. ఎన్నికష్టాలు పడ్డదో నే నిప్పుడు చెప్ప లేను. నాన్న ఆబిడను ఇబ్బందిపెట్టారని అనను. కాని, ఆమెజీవితమే అటువంటిది. అర్ధరాత్రీ అపరరాత్రీ ఎంతమంది వచ్చిపడ్డా మారుమాట్లాడకుండా వండిపెట్టేది. ఆ వండడం మామూలు వంటకాదు. ఆచారాలుకావాలి. అవన్నీ అలా వుంచు. నాన్నచేతులో ఆస్తి అంతా అయిపోతున్నదని ఆమెకు తెలుసు. తన పిల్లలకు అన్యాయం జరుగుతున్నదని ఆమెకు తెలుసు. అయినా నాకు తెలిసినంతవరకూ ఏనాడూ ఆమె అన్నయ్యమాటకు ఎదురుతిరగలేదు. ఇటువంటి మీ అమ్మ మనందరికీ నిజంగా పూజ్యురాలు బాబూ."

రంగారావ్ చేయగలిగిందంతా చేసినా ప్రయోజనం లేకపోయింది. ఆఖరు ఘడియలలో పరంధామయ్యగారికి కొంచెం స్పృహ వచ్చింది. తమ్ముణ్ణి గుర్తుపట్టి "రంగా... రంగా...వచ్చావా...క్షమించవూ..." అన్నాడు.

"అన్నా......" అంటూ రంగారావ్ అన్నగారి మీద పడిపోయాడు.

అంతలో పరంధామయ్యగారు పిల్లలను పిలిచి ఇలా అన్నాడు :

"అయిపోయింది బాబూ...... అయిపోయింది. బాబాయి చెప్పినట్లు నడుచుకోండి. లోకాన్ని మెప్పిద్దామని ఏమీ చెయ్యకండి. ఇతరులను మెప్పించే పనులు చెయ్యడం- చేస్తా మనుకొంటూ ఆత్మవంచన చేసుకోడం సులభం.

నిజానికి...నీకు నువు సహాయం చేసుకోలేకపోతే ఇతరులకు ఏమీ...చె...య్య......లేవు.'' అంతే...

పంతులు పరంధామయ్యగారి ప్రాణం... పోయింది.

కాని, విచిత్ర మేమిటంటే పరంధామయ్యగారి పెద్ద కొడుకు మాత్రం తండ్రిమాటలను విస్మరించకుండా ఏదో లక్ష్యం సాధించదలిచిన సాధకునిలాగా జీవితపోరాటం సాగిస్తున్నాడే కాని తండ్రి తనను అన్యాయం చేశాడని చింతించడంలేదు. ఇక రంగారావ్ సంగతి చెప్పనేలవసరం లేదు. మిగిలిన ఆ పూరిల్లూ, ఎకరంపొలం పిల్ల లిద్దరికీ రాసిచ్చాడు. దయాల్బాగ్‌లో ఏదోఉద్యోగం చేస్తాడు. ఇదీ...జీవితం.